Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

8 Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 184 | Monday : 30.06.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :184 | సోమవారం 30 జూన్ 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి. అనుభవం,అర్హతను బట్టి ప్రాధాన్యత ఇవ్వబడును

సంప్రదించండి సెల్ : 9440815774





## తెలంగాణ బీజేపీలో ఉత్కంఠ

- కొత్త నాయకుడెవరు?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపికకి నోటిఫికేషన్ విడుదల
- జూలై ఒకటో తేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన
- బీజేపీ పార్టీకి విధేయుడిగా ధర్మపురి అరవింద్‌కు గుర్తింపు ఉంది
- ఇక బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్‌షాకు సన్నిహితుడిగాను ఆయన ముద్ర వేసుకున్నారు
- తెలంగాణలో బలమైన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత
- ఎంపీలు ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్ మధ్యే పోటీ
- అధ్యక్ష పదవిపై బయటికి చెప్పకపోయినప్పటికీ.. పార్టీలో ఇప్పటికే నిర్ణయం జరిగిపోయిందనే ప్రచారం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణ బీజేపీలో రాజకీయం ఆసక్తికరంగా మారింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరు అనే దానిపై పార్టీలో చర్చ నడుస్తోంది. బీజేపీ ఎంపీలు ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్ మధ్యే పోటీ ఉందని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇక, జూలై ఒకటో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన వెలువడనుంది. కాగా, నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంపికకి నోటిఫికేషన్ విడుదల కానుంది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. రేపు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. జూలై ఒకటో తేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన చేస్తారు. అయితే, తెలంగాణ బీజేపీ ప్రముఖంగా ఎంపీలు ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్ మధ్యే పోటీ ఉన్నట్టు తెలుస్తోంది. వీరిద్దరిలో ఒకరిని సారథ్య బాధ్యతలు వరించే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా.. - మిగతా3లో



## రెండు మూడు నెలల్లో శివకుమార్ సీఎం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు
- కాంగ్రెస్ హైకమాండ్‌కు ఇక్కడి పరిస్థితి గురించి తెలుసు
- ఆయనకు అవకాశం ఇవ్వడానికి సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటుంది

## 2029 ఎన్నికలే నా టార్గెట్

- పనితీరు బాగా లేకుంటే గుడ్‌బై చెప్పేస్తా
- వైకాపా హయాంలో రాష్ట్రం ధ్వంసమైంది
- ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారు
- తెదేపా, జనసేన, భాజపా ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకెళ్తున్నాయి
- ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్‌లో 703 సేవలు
- రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు



**అమరావతి**

వైకాపా హయాంలో రాష్ట్రం ధ్వంసమైందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టించారని విమర్శించారు. తెదేపా, జనసేన, భాజపా ఎప్పటికప్పుడు సమన్వయంతో ముందుకెళ్తున్నాయన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు ఆయన దిశానిర్దేశం చేశారు. పనితీరు బాగా లేకుంటే గుడ్‌బై చెప్పేస్తానని తేల్చిచెప్పారు. "రాష్ట్ర విభజన వేళ అనేక సమస్యలు వచ్చినా నిలదొక్కుకున్నాం. వైకాపా పాలనతో - మిగతా2లో



## ఫలించిన 60 ఏళ్ల పోరాటం

- ఎల్లారెడ్డిగూడలో పార్క్ ఆక్రమణలు తొలగించిన హైడ్రా
- 1961 నుంచి ఉన్న ఆక్రమణలను తొలగించడంతో 1533 గజాల విస్తీర్ణంలోని పార్క్ అందుబాటులోకి
- సాయి సారథినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు
- ఈ లేఅవుట్‌లో 6 రోడ్లను అభివృద్ధి చేసి.. పార్క్‌ను మాత్రం ఖాళీ చేయించలేదని జీహెచ్‌ఎంసీకి పలుమార్లు కాలనీ వాసులు ఫిర్యాదు



## 'ఉచిత ల్యాప్‌టాప్' పేరిట కొత్త మోసం.. జాగ్రత్త

- కేంద్రం హెచ్చరిక
- ప్రజలకు ఆశల్ని కల్పించేలా సైబర్ మాయా వలను విసిరి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసేందుకు కొత్త పన్నాగాలు
- తాజాగా దేశంలో విద్యార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు మెసేజ్‌లు



## 90 డిగ్రీల వంతెన.. ఏడుగురు ఇంజినీర్ల సస్పెన్షన్

- ఆ వంతెన 90 డిగ్రీల మలుపుతో నిర్మించడమే అందుకు కారణం
- దీనికి సంబంధించి మీడియాలో అనేక కథనాలు
- ఇలాంటి డిజైన్‌లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు

### కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు

## బాధ్యత మాది కాదు



"భాజపా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోంది

ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ..

ఇప్పుడు వాటిని అమలు చేయాలని భాజపాను అడుగుతోంది

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

తెలంగాణలో పసుపు బోర్డు ఏర్పాటు చేసిన చేసిన ప్రధాని మోదీ, కేంద్ర హెూ మంత్రి అమిత్‌షాకు తెలంగాణ ప్రజలు, రైతాంగం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నానని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్‌షా ప్రారంభించిన విషయం తెలిసిందే. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్‌ను కూడా తెలంగాణలో ఏర్పాటు చేస్తామని హెూంశాఖ మంత్రి ప్రకటించినట్లు తెలిపారు. నేషనల్ కో-ఆపరేటివ్ ఆర్గానిక్ లిమిటెడ్‌కి సంబంధించిన బ్రాంచ్ ఆఫీస్‌ను కూడా తెలంగాణలో ఏర్పాటు చేయబోతున్నట్లు అమిత్‌షా వెల్లడించారని చెప్పారు. "భాజపా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోంది. ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు వాటిని అమలు - మిగతా3లో



## మార్స్‌పై నీటి జాడలు!

- కీలక సమాచారం వెల్లడించిన నాసా క్యూరియాసిటీ రోవర్!
- మార్స్‌పై సైతం శాస్త్రవేత్తలో పరిశోధనలు చేపడుతున్న విషయం తెలిసిందే.
- నాసా క్యూరియాసిటీ రోవర్ తాజాగా మార్స్‌పై ఓ రహస్య ప్రాంతంలో తవ్వకాలు
- బృహస్పతి ఉపగ్రహమైన గానిమీడ్ భూగర్భంలో సముద్రం ఉండే అవకాశం ఉందని అంచనా

## కాంగ్రెస్‌లో 'కొండా' కల్లోలం

- ఆ పార్టీ ఎమ్మెల్యేల అత్యవసర భేటీ
- హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు భేటీ
- మురళి శనివారం భారీ అనుచరగణంతో ర్యాలీగా గాంధీభవన్‌కు వచ్చి, నేరుగా పీసీసీ క్రమశిక్షణ కమిటీతో సమావేశమైన సంగతి తెలిసిందే



# ఘనంగా రామకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ మహోత్సవ వేడుక

**రామకృష్ణ రెడ్డి- విమల దంపతులకు ఘన సత్కారం, జ్ఞాపిక బహుకరణ.**

**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 29:**



వరదయ్యపాలెం మండలంలోని రాజేశ్వరి కళ్యాణ మండపంలో పిన్నమరెడ్డి రామకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ మహోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంఈఓ సరస్వతి అధ్యక్షత వహించారు. పీడీ కుమార్ అతిధులకు సాదర స్వాగతం పలికారు. ఎం ఈ ఓ-2 గున్నయ్య, అతిధులు జ్యోతి ప్రజ్వలన చేయగా, పోలూరు జగన్నాధం వినాయక ప్రార్ధన తో సమావేశం ప్రారంభించారు. తిరుపతి రాయుడు, జగన్నాదం గీతాలాపన ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా విశ్రాంత డివైఈవో చిట్టిబాబు మాట్లాడుతూ రామకృష్ణరెడ్డి కార్యక్రమంకు 150 కిలోమీటర్లు ప్రయాణం చేసి హాజరయ్యాను అంటే,విద్యారంగంలో రామకృష్ణరెడ్డి చేసిన ఎంత గొప్పదో అర్థం చేసుకోవాలి అని ఒక్కమాటలో గొప్పగా అన్నారు. త్రిమూర్తి స్వరూపంగా భావించే గురువు అన్నది గురుతర బాధ్యతను ముడున్నర దశాబ్దాలు పాటు నిర్వహించి, ఎన్నో విద్యా కుసుమాలను వికసింపజేసి, విద్యారంగంలో రామకృష్ణారెడ్డి సేవలు చేసిన సేవలను పలువురు ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక నాయకులు యుగంధర్ రెడ్డి, తిలక్ బాబు, నాయుడు దయాకర్ రెడ్డి, కే వెంకటయ్య (చిన్న), చిన్నిరాజ్, హెచ్‌ఎం జి కృష్ణయ్య తదితరులు ప్రశంసించారు. టీడీపీ క్లస్టర్ ఇంచార్జి నిర్మల్, మాజీ వైస్ ఎంపీపీ విక్రమార్కరెడ్డి, పాండూరు రమేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఇంకా అనేకమంది. ఉపాధ్యాయులు, మిత్రులు, బంధువులు, శ్రేయోభిలాషులు, గ్రామస్థులు, విద్యార్థులు, ప్రెస్ క్లబ్ జర్నలిస్ట్‌లు, పలువురు సర్పంచ్లు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు హాజరై, తమదైన రీతిలో పూలమాలలు, శాలువలుతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వరదయ్యపాలెం మండల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో, సన్మాన పత్రము(రామకృష్ణరెడ్డి బాల్యం, విద్యాభ్యాసం, కుటుంబ జీవితం, ఉద్యోగ పర్వం, వ్యక్తిత్వం, ప్రశంస)తో పాటు, గజమాలతో పి.రామకృష్ణరెడ్డి - విమల దంపతులను ఘనంగా సత్కరించారు. మిగిలినసమయంలో కూడా విద్యా రంగంకు తనదైన శైలిలో సేవలు అందించాలని పలువురు కోరారు. పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేసిన వారందరికీ రామకృష్ణరెడ్డి దంపతులు ధన్యవాదములు తెలిపారు.


# కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో, ప్రెస్ మీట్ నిర్వహించిన ఇంచార్జ్ ఆవులు గోపి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:**

కుప్పం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, ఆదివారం ప్రెస్ మీట్ నిర్వహించిన కుప్పంకాంగ్రెస్ పార్టీఇంచార్జ్ ఆవులు గోపి ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు కుప్పం మండల అధ్యక్షులు మునుస్వామి గుడిపల్లి మండల అధ్యక్షులు నల్లగంపల్లి కృష్ణప్ప శాంతిపురం మండలఅధ్యక్షులు అ బకల దొడ్డి నంజప్ప రామకుప్పం మండలం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం కుప్పం మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు నిజాముద్దీన్ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు ఇర్ఫాన్ భాషా ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు వివిధ విభాగాలకు చెందిన నాయకులు పాల్గొని ప్రెస్ మీట్ నిర్వహించారు.

# 11సంవత్సరాల వికసిత భారతదేశపు సేవ,కరపత్రాలను పంచిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎస్ తులసినాథ్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఁజూన్ 29:**

భారత ప్రధాని నరేంద్ర మోదీ11 సంవత్సరాల వికసిత భారతదేశపు సేవ,సుపరిపా లన,పేదల సంక్షేమం,అణగారిన వర్గాలకు గౌరవం, రైతుల సంక్షేమానికి భరోసా, ఆయుష్మాన్ భారత్ ద్వారా అందరికీ ఆరోగ్య సంరక్షణ, ఇలా అన్నిరంగాల్లో భారత ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్ల తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఆదివారం రోజు కుప్పంనేతాజీ రోడ్‌లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందచేసి ప్రజలకు వివరిస్తున్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎస్ తులసినాథ్ పాల్గొన్నారు. కుప్పం అధ్యక్షులువడివేలు నితీష్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఇంద్ర శ్రీహరి శ్రీధర్ ప్రభాకర్ ప్రతాప్ సింగ్ వసంత్ చల్ల కుట్టి అశోకు సెందిల్ కుమార్ పాల్గొన్నారు.

# ఉచిత కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:**

సాయిమాత సేవ ట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరు శారద కంటి ఆసుపత్రి వారిచే ఆదివారంరోజు కుప్పంపట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఉచిత కంటి పరీక్ష శిబిరము నిర్వహించబడినది. ఈ శిబిరానికి దాదాపు 120 మంది కంటి రోగులు పరీక్షలు నిర్వహించి వీరిలో 30 మంది ఎంపిక చేయడం జరిగినది.వీరికి రేపు బెంగళూరులోని శారదకంటి హాస్పిటల్ నందు ఆపరేషన్లు నిర్వహించబడును.ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది బాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా వేలూరు సుబ్రహ్మణ్యం



చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:

ఆదివారం పుంగనూరు తపాలా శాఖ బ్రాంచ్‌లో ఆల్ ఇండియా గ్రామీణ తపాలా శాఖ, ఉద్యోగుల సంఘం ఎన్నికలలో కార్యదర్శిగా వేలూరు సుబ్రహ్మణ్యం అధ్యక్షుడిగా కుదురు చిమనపల్లి బ్రాంచ్ నారాయణరెడ్డి, కోశాధికారిగా కృష్ణమూర్తిలు ఎన్నికైనట్లు వారు తెలిపారు. గ్రామీణ తపాలా శాఖ ఉద్యోగుల సంఘం తరఫున ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏలూరు సుబ్రహ్మణ్యం తెలిపారు.

# మన్ కీ బాత్ కార్యక్రమం



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 29:**

శ్రీకాళహస్తి శ్రీ రామ్ నగర్ కాలనీ 109వ పోలింగ్ బూత్ నందు గౌరవనీయులు ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ మన్ కీ బాత్ మనసులో మాట 123వ ఎపిసోడ్ ను బిజెపి తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, బిజెపిరాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమా , పోలింగ్ బూత్ అధ్యక్షులు లత, అరుణ, జ్యోతి, ప్రియాంక, వార్డు సభ్యులు రాజా రమేష్, చంద్రశేఖర్, రేవతి తదితరులతో కలిసి వీక్షించారు.

# విశేష పూజలు అందుకున్న దుర్గమ్మ



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:**

వీ.కోటపట్టణం దుర్గానగర్‌లో వెలసి యుండు శ్రీదుర్గామాత ఆలయంలో ఆదివారం రోజు అమ్మవారికి విశేషంగా పూజలు నిర్వహించి అమ్మవారిలయంలో కలిశాలతో అమ్మవారికి ప్రదక్షిణలు నిర్వ హించి అనంతరం విశేషాలంకరణ కలిగిన అమ్మవారి దివ్యదర్శనాన్ని భక్తులకు దర్శింపచేసినారు. దర్శనానంతరం విచ్చేసిన భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారికి ధూపదీప నైవేద్యాన్ని సమర్పించినారు. పూజలో భాగంగా సాయం సంధ్య వేళ అమ్మవారికి విశేషంగా మహిళల చేత కుంకుమ అర్చనలు నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి దుర్గామాత ఆలయ ధర్మకర్త ఎస్సార్ దామోదర్ రెడ్డితో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ మెంబర్లు జగన్మోహన్ రెడ్డి, రఘుపతి నాయుడు,జనార్ధన్, వీకోట మాజీ ఎంపీపీ సులోచన రంగనాథ్, అనేక మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్ర మాన్ని అంతా ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర శర్మ బృందం చేత పూజారి కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# పార్టీ కార్యాలయంలో మన్‌కి బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కోలా ఆనంద్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్29:**

శ్రీకాళహస్తి భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ కన్వీనర్ కోలా ఆనంద్ బీజేపీ పార్టీ కార్యాలయంలో నరేంద్రమోదీ మనసులోని మాట మన్ కి బాత్ కార్యక్రమాన్ని కార్యకర్తలుతో వీక్షించడం జరిగింది. నరేంద్ర మోదీ దేశ ప్రధానమంత్రి అయిన నుంచి 2014 అక్టోబరు 3వ తారీఖు నుంచి ఇప్పటికీ 123ఎపిసోడ్ మన్ కి బాత్ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని కోలా ఆనంద్ తెలిపారు. ఆదివారం నరేంద్రమోదీ మన్ కి బాత్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవంపై మోదీ ప్రశంసలు వెల్లడించారు. దేశ విదేశాల్లో యోగాను అద్భుతంగా నిర్వహించరాని ప్రత్యేకంగా వైజాగ్‌లో 3 లక్షల మందితో బ్రహ్మాండంగా జరిపారని మోదీ మన్‌కీ బాత్‌లో కితాబిచ్చారని కోలా ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్రకార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్‌తో పాటు జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ పార్టీకో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, తొట్టంబేడు మండలం అధ్యక్షులు వేదం కృష్ణయ్య, పట్టణ యువమోర్చా అధ్యక్షులు తానికొండ్ల భరత్ నాయుడు, పుణ్యం డిల్లీరెడ్డి, నానీ, డిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవతో కరెంటు లైన్ మార్పు గాలి మురళి నాయుడు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 29:**



శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు కొణతనేరి పంచాయతీ గుర్రప్ప నాయుడు కండ్రిగ గ్రామంలో ఇంటి మీద కరెంటు తీగలు వేలాడుతున్నా గత ప్రభుత్వంలో పట్టించుకోకుండా కల్లుగీత కార్మికుల గడ్డివాము కూడా దగ్ధం అవడంతో మండల రెవెన్యూ అధికారులకు విన్నవించిన పట్టించుకున్న దాఖలాలు లేవని అని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళగా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో వెంటనే ఏఈ బాలాజీ స్పందించి కరెంటు తీగలు మార్చడంతో చుట్టుపక్కల ఉన్నవారు ఊపిరి పీల్చుకొని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జంతువుల దాడిలో నెమలి మృతి

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:**



అడవిజంతువుల దాడిలో నెమలి మృతి, చెందిన సంఘటన ఆదివారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. చౌడేపల్లి మండలం పెద్ద ఎల్లకుంట్ల సమీపంలోని ఎల్లకుంట్ల గుట్టకు కింద గల కడియాల మహేష్ బాబు మామిడి తోటలో నెమల్ల గుంపు ఉంది ఆదివారం తెల్లవారు జామున మృతి చెందిన నెమలిని రైతు గుర్తించాడు, అడవి జంతువులు గుంపుపై దాడి చేసి చంపాయని స్థానిక రైతులు అంటున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు తెలియ జేసినట్లు రైతులు తెలిపారు.

# భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:**

శక్తిక్షేత్రం బోయకొండగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది ఆషాడ మాసంతొలి ఆదివారం కావడంతో కర్ణాటక తమిళనాడు తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు తరలిరావడంతో బోయకొండ భక్తజనసంద్రమైంది, కొండ దినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారిని దివ్యంగా సుందరంగా అలంకరించారు. అంతేకాకుండా ఆషాడ మాసం తొలి ఆదివారం కావడంతో ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ అలంకరణకు బెంగళూరుకు చెందిన గాయత్రి ఫ్లవర్ స్టాల్ కృష్ణ ఉభయ దారుడుగా వ్యవహరించారు. ఎక్కడ చూసినా కొండపై భక్తులు అధిక సంఖ్యలో కనిపించారు అక్కడక్కడ భక్తులే యాత్రికులకు ఉచిత అన్న ప్రసాదం అందించారు. ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార సిబ్బంది అర్చకులు అధిక సంఖ్యలో వచ్చిన యాత్రికులకు సేవలు అందించారు.

# ఉచిత కంటి ఆపరేషన్లకు 30 మంది ఎంపిక



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:**

సాయిమాత సేవ ట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరు శారద కంటి ఆసుపత్రి వారిచే ఆదివారంరోజు కుప్పంపట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఉచిత కంటి పరీక్ష శిబిరము నిర్వహించబడినది. ఈ శిబిరానికి దాదాపు 120 మంది కంటి రోగులు పరీక్షలు నిర్వహించి వీరిలో 30 మంది ఎంపిక చేయడం జరిగినది. వీరికి రేపు బెంగళూరులోని శారదకంటి హాస్పిటల్ నందు ఆపరేషన్లు నిర్వహించబడును.ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది బాబు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం లయన్స్ క్లబ్, పి ఈ ఎస్ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసిన మెగా హెల్త్ క్యాంప్

**రామకుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 29:**



కుప్పంనియోజకవర్గం రామకుప్పం మండలంలోని పిఎంకె తాండా గ్రామంలో లయన్స్ క్లబ్ కుప్పం, పిఈఎస్ మెడికల్ కాలేజీ హాస్పిటల్, కుప్పం వారి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్, ఎముకలు, స్త్రీ గర్భకోశ వ్యాధులు, కీళ్లు, గొంతు నొప్పి, చెవి, ముక్కు మొదలగు అన్ని వ్యాధులకు ఉచితంగా చూడటం, మందులను ఇవ్వడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరానికి 200 మందికి పైగా పరీక్షించుకొన్నారు. ఈ సందర్బంగా లయన్స్ క్లబ్ అడ్వైసర్ అంబ మహేష్,గ్రామ పెద్దలు మునిరాజ్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలోని పేద ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యం అందించాలనే ఉదేశంతో ఈ ఆరోగ్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఇలాంటి కార్యక్రమం తరచుగా నిర్వహిస్తే బాగుంటుందని పేదప్రజలు అభిప్రాయపడ్డారు.ఈ కార్య క్రమానికి ఎం.ఎస్.కృష్ణా నాయక్ ఎస్టీసెల్ అధ్యక్షులు మునిరాజు నాయక్ పంచాయితీ అధ్య క్షులు, ధనపాల్ నాయక్, మురళి నాయక్, చంద్ర బాబు నాయక్, కృష్ణా నాయక్, సుధాకర్ నాయక్, గజేంద్ర నాయక్, కుమార్ నాయక్, అనిల్ నాయక్, లయన్స్ క్లబ్ సభ్యులు సెంథిల్ కుమార్, ప్రసాద్, చరణ్, డా.కృష్ణ మూర్తి, ఏకాంబరం పాల్గొని జయప్రదం చేశారు.

# సబ్ జైలును సందర్శించడం ఎమ్ఎస్ భారతి, చిత్తూరు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జ్

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 29:**



శ్రీకాళహస్తి హైకోర్టు,ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా పరిధి లో ఉన్న అన్ని జైలును సందర్శించి, వచ్చేనెల జులై 5న తేదీ జరుగు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతం చేయాలని అవగాహన కల్పించుటకు. ఈ సందర్భంగా సబ్ జైల్లో తులసి మొక్కను నాటారు. శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్ జైలును సందర్శించడం జరిగింది. జైలు రూమ్‌లోని పరిశుభ్రత, వంటశాల, స్టోర్ రూమ్, బాత్రూంలను పరిశీలించారు. ప్రతి ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి భారతి మాట్లాడుతూ ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీలకు తప్పక చట్టం పై అవగాహనా కలిగివుండాలి అన్నారు. అలాగే బెయిల్ గురించి, ఉచిత న్యాయం, న్యాయ చట్టం మొదలైన చట్టాలపై అవగా హనా కలిగి ఉండాలని తెలిపారు. మీ పరిసరప్రాంతాలు పరిశుభ్రముగా ఉండాలని తెలిపారు. మీకు ఏ సమస్యవున్న ఒక అర్జీ రూపంలో ఇచ్చినచో మీ సమస్య పరిష్కరించుటకు ప్రయత్ని స్తామని తెలిపారు. అలాగే రాబోవు జులై 5నతేది జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని కక్ష దారులకు, న్యాయవాదులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ జైల్ సుపర్డెంట్ శ్రీకాంత్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

# 2029 ఎన్నికలే నా టార్గెట్

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రం ధ్వంసమైంది. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తామని ప్రజలకు చెప్పాం. వారు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. ఐదేళ్లలో మనం ఏం చేయాలనేదానిపై ఇప్పటికే చర్చించాం. ఇచ్చిన మాట ప్రకారం సుపరిపాలనలో తొలి అడుగు వేశాం. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రజల ఆకాంక్షలను మనం నెరవేర్చాలి. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి.. అది మన బాధ్యత. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి. భవిష్యత్తులో ఏం చేస్తామో స్పష్టంగా చెప్పాలి. ఎన్నికల్లో దామాషా ప్రకారం అందరికీ న్యాయం చేశాం. సంక్షేమం అంటే ఏంటో చూపించిన పార్టీ మనది. ఆర్థిక సంస్కరణలు అందిపుచ్చుకుని పరిపాలన చేశాం. చేసిన పనిని ప్రజలకు చెప్పడం ముఖ్యం. 2014-19 మధ్య చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకపోయాం. సుస్థిర పాలన ఉంటేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

**ఆగస్టు 15 నుంచి వాట్సప్ గవర్నెన్స్‌లో 703 సేవలు**

బ్లాక్ మెయిల్ రాజకీయాలు మనం ఎప్పుడూ చేయం. కేంద్రం మనకు బాగా సాయం చేస్తోంది. సమస్యలన్నీ పరిష్కారం అయ్యాయని చెప్పడం లేదు. ఇంకా చాలా పరిష్కరించాలి.. అదే మన లక్ష్యం. సేవ, పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యమివ్వాలి. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్లు పెంచి ఇస్తున్నాం. పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చి రైతులను ఆదుకుంటున్నాం. ప్రతి రైతుకూ రూ.20వేల సాయం చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభిస్తాం. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు మంజూరు చేశాం. రాజధాని ప్రాంతంలో పనులను పట్టాలెక్కించాం. పోలవరానికి రూ.12,500 కోట్లు కేంద్రం ఇచ్చింది. రాబోయే ఏడాదిన్నరలో ఆ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 నాటికి జాతికి అంకితం చేస్తాం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రూ.11,400 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మరో నాలుగైదు నెలల్లో అది లాభాల బాట పడుతుంది. క్రిష్ సిటీలో పనులు ప్రారంభయ్యాయి. ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకున్నాం. వాట్సప్ గవర్నెన్స్‌తో సుమారు 500 సేవలు ఆన్‌లైన్‌లో అందిస్తున్నాం. ఆగస్టు 15 నాటికి 703 సేవలు ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల అవినీతి తగ్గుతుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పాలన అందించే అవకాశం ఉంటుంది. పాలసీలు ఎంత మంచివైనా అమలు చేయడంలో చిత్తశుద్ధి ఉండాలి. రాష్ట్రానికి అనేక పెద్ద కంపెనీలు వస్తున్నాయి. రాష్ట్రాన్ని 5 జోన్లుగా విభజించి అభివృద్ధి ప్రణాళిక తయారు చేస్తున్నాం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి శ్రీకారం చుట్టాం.

రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు.. జాగ్రత్త

భవిష్యత్తుపై ప్రజలకు నమ్మకం కలిగించే బాధ్యత మనపై ఉంది. ప్రజాసేవ చేసే కుటుంబాలను ప్రోత్సహిస్తున్నాం. నిత్యం ప్రజల మధ్య ఉంటేనే సాయం చేయగలం.. లేకుంటే ఏమీ చేయలేం. చిన్నచిన్న పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుందాం. మన ప్రవర్తన, అలవాట్లలో తప్పులుంటే మార్చుకుందాం. కొందరు ఎమ్మెల్యేలను పిలిచి వ్యక్తిగతంగా మాట్లాడుతున్నా. మొహమాటం లేదు.. వారి తప్పులు స్పష్టంగా చెబుతున్నా. రాజకీయాల్లోకి ఆర్థిక ఉగ్రవాదులు వస్తున్నారు.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. వివేకాను





దారుణంగా చంపేసి అంత్యక్రియలు చేసేందుకు సిద్ధమయ్యారు. నిందితులను అప్పుడే అరెస్ట్ చేసుంటే ఫలితాలు మరోలా ఉండేవి. కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూశాం. ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా రాజకీయాలు చేస్తున్నారు. గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లను ఎవరైనా పరామర్శిస్తారా? జగన్ సత్తెనపల్లి పర్యటనలో కారు కింద వ్యక్తి పడినా కనీసం పట్టించుకోలేదు. తప్పులు చేస్తే ఆధారాలు చూపిస్తాం.. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు భద్రత కల్పించడమే మన ప్రథమ కర్తవ్యం.

2029 ఎన్నికలే నా టార్గెట్

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ చనిపోతే మనమే కారణమన్నారు. నిజం గడప దాటేసరికి అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందని గ్రహించాలి. ప్రజలకు వాస్తవాలు చెప్పడంతో నేతలంతా ముందుండాలి. సోషల్ మీడియా యుగంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. అక్కడ దారుణంగా వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. 2029 ఎన్నికలే నా టార్గెట్. పనితీరు బాగా లేకుంటే మొహమాటం లేకుండా గుడ్‌బై చెప్పేస్తా. వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు కౌంట్‌డౌన్ పెట్టుకుని పనిచేస్తున్నాం. ఏళ్లు.. నెలలు.. రోజులు.. గంటలు కూడా లెక్కిస్తున్నా. తానా, ఆటా అంటూ ఫారెన్ ట్రిప్పులు వద్దు. అలా వెళ్తే టాటా చెప్పేస్తా. ప్రజాప్రతినిధుల గ్రాఫ్ పెరుగుతుందా? తగ్గుతుందా? పరిశీలిస్తున్నా. మొదటి ఏడాది పాలన పూర్తయింది.. రెండో ఏడాది ప్రారంభమైంది. నెల రోజులపాటు ప్రతి గడపకూ నేతలు వెళ్లాలి" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# తెలంగాణలోనూ బీజేపీదే అధికారం!

-మొదటిపేజీ తరువాయి

ఛైర్మన్‌గా తెలంగాణ వ్యక్తినే నియమించాం. నిజామాబాద్ పసుపు పంటకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉంది. పసుపు ఒక దివ్య ఔషధం. యాంటీ వైరల్, యాటీ బ్యాక్టీరియా, యాంటీ క్యాన్సర్‌గా పనిచేస్తుంది. 2030 నాటికి ఒక బిలియన్ డాలర్ విలువైన పసుపును మనం ఎగుమతి చేయాలి. ఈ బోర్డు ద్వారా రైతులకు నూతన సాగు పద్ధతులపై శిక్షణ కల్పిస్తాం. ఇక్కడి పసుపు పంటకి జియో ట్యాగింగ్ చేస్తున్నాం. భారత్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులకు మేలు చేయాలని కృషి చేస్తున్నాం"అని కేంద్రమంత్రి అమిత్‌షా తెలిపారు. నిజామాబాద్ రైతులు పసుపుబోర్డు కోసం 40 ఏళ్ల పాటు పోరాటం చేశారని కేంద్రమంత్రి అమిత్ షా గుర్తు చేశారు. నిజామబాద్‌లో పసుపుబోర్డు జాతీయ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక పాలిటెక్నిక్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో ఆయన ప్రసంగించారు. నిజామాబాద్ రైతులు పండించిన పసుపు భవిష్యత్‌లో ప్రపంచమంతా ఎగుమతి అవుతుందన్నారు. పసుపుబోర్డు కార్యాలయం ఏర్పాటుతో స్థానిక రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయని ఆయన చెప్పారు. భారత్ ఆర్గానిక్ లిమిటెడ్, భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్ కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటవుతున్నాయని వివరించారు. భారత్ ఎక్స్‌పోర్టు లిమిటెడ్‌తో నిజామాబాద్ పసుపు అమెరికా, యూరప్‌కు ఎగుమతి అవుతుందని అమిత్ షా వెల్లడించారు.

**తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం**

తెలంగాణలో బీజేపీ తప్పక అధికారంలోకి వస్తుందని అమిత్ షా దీమా వ్యక్తం చేశారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే బీజేపీ విజయం ఖాయమైందని తెలుస్తోందని వివరించారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌కు పసుపుబోర్డు సాధించారని చెప్పారు. పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని కూడా నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తున్నామని అమిత్? షా వెల్లడించారు. మోదీ ఏదైనా చెప్పారంటే అది తప్పకుండా చేసి చూపిస్తారని ఆయన అన్నారు.

**దేశంలో నక్సలిజం లేకుండా చేస్తాం**

మావోయిస్టులు (నక్సలైట్లు) తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా అన్నారు. 'పహల్గాంలో ఉగ్రదాడితో పాకిస్థాన్ మనల్ని భయపెట్టాలని చూసిందని ఆ తర్వాత భారత్ శక్తి ఏమిటో ఆదేశానికి, ప్రపంచానికి తెలిసింది అని అమిత్?షా పేర్కొన్నారు.



ఉగ్రవాదాన్ని మాత్రమే కాకుండా దేశంలోని నక్సలిజం కూడా లేకుండా చేయాలన్నదే మోదీ లక్ష్యమని స్పష్టం చేశారు. నక్సలిజాన్ని తుదముట్టించాలా లేదా? మీరే చెప్పండని అక్కడ ఉన్న సభికుల్ని ఉద్దేశించి అమిత్?షా అన్నారు. 2026 మార్చి 30 లోపు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. నక్సలైట్లు తక్షణమే హత్యాకాండ ఆపేసి లొంగిపోవాలని కోరారు. నక్సలైట్లు త్వరగా జనజీవన స్రవంతిలోకి రావాలని అమిత్?షా పిలుపునిచ్చారు. ఇప్పటికే 10వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని, వారంతా జన జీవన స్రవంతిలోకి వచ్చేసినట్లు గుర్తుచేశారు.

**బీఆర్ఎస్‌పై మండిపడిన అమిత్ షా**

బీఆర్ఎస్ సర్కార్ అవినీతికి పాల్పడిందా లేదా అని ప్రజలను అమిత్ షా ప్రశ్నించారు. ధరణి పోర్టల్, కాళేశ్వరం ఇలా అనేక అంశాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఢిల్లీకి ఏటీఎంగా మార్చేసిందని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీఆర్ఎస్? పోయింది కానీ, అవినీతి పోలేదు అని అమిత్ షా అన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ధర్మపురి అర్వింద్, లక్ష్మణ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కార్యాక్రమానికి హాజరయ్యారు.

**రైతును రారాజు చేయాలనేది నరేంద్రమోదీ నినాదం: కేంద్రమంత్రి బండి సంజయ్**

నరేంద్రమోదీ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. నిజామాబాద్‌లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం స్థానిక పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళన సభలో మరో కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రసంగించారు. "పసుపు బోర్డు కోసం ఇందూరు రైతులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఢిల్లీలో పసుపు అర్వింద్ అంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్ షా ఆదేశాలతో నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేశారు. దీంతో పాటు జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నిజామాబాద్ వ్యక్తినే నియమించారు. రైతును రాజు చేయాలనేది గత నినాదం. రైతును రారాజు చేయాలనేది నరేంద్రమోదీ నినాదం. రైతులంతా మోదీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి.. అండగా ఉండాలి. తెలంగాణలో అన్ని పార్టీలకు అవకాశం ఇచ్చారు. భాజపాకు ఒక్కసారి అవకాశమివ్వండి" అని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు బాధ్యత మాది కాదు

-మొదటిపేజీ తరువాయి

చేయాలని భాజపాను అడుగుతోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధత్య మాది కాదు. కేవలం భాజపా ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత మాత్రమే మాది. కాంగ్రెస్ హామీలను రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేయాలి. మోదీ తెలంగాణకు ఏం ఇచ్చారు?కిషన్‌రెడ్డి ఏం తెచ్చారనే విచిత్ర వాదన వినిపిస్తోంది. అధికారంలో కాంగ్రెస్ నేతలు ఉండి హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై వేయడం ఏంటి? ఇచ్చిన హామీలను కాంగ్రెస్ కచ్చితంగా అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నా"అని కిషన్‌రెడ్డి అన్నారు.

## ఫలించిన 60 ఏళ్ల పోరాటం



**హైదరాబాద్:** మధురానగర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలోని ఎల్లారెడ్డిగూడలో పార్క్ ఆక్రమణలను ఆదివారం హైడ్రా సిబ్బంది తొలగించారు. 1961 నుంచి ఉన్న ఆక్రమణలను తొలగించడంతో 1533 గజాల విస్తీర్ణంలోని పార్క్ అందుబాటులోకి వచ్చింది. సాయి సారథినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించి విచారణకు ఆదేశించారు. 1961లో 5 ఎకరాల విస్తీర్ణంలో సాయి సారథినగర్ పేరిట 35 ప్లాట్లతో లేఅవుట్ ఏర్పాటు చేశారు. 1,533 గజాల స్థలాన్ని పార్క్‌గా చూపించారు. లేఅవుట్ వేసిన నారాయణ ప్రసాద్ వారసులు పార్కు స్థలంలో షెడ్డు వేసి ఆక్రమించారు. అధికారులను మేనేజ్ చేసి ఇంటి నంబర్ కూడా తెచ్చుకున్నారు. ఈ లేఅవుట్‌లో 6 రోడ్లను అభివృద్ధి చేసి.. పార్క్‌ను మాత్రం ఖాళీ చేయించలేదని జీహెచ్‌ఎంసీకి పలుమార్లు కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోకపోవటంతో సాయిసారథి నగర్ వాసులు హైడ్రాను ఆశ్రయించారు. క్షేత్ర స్థాయిలో వివిధ శాఖలతో కలిసి హైడ్రా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి.. ఇవాళ ఆక్రమణలు తొలగించారు. 60 ఏళ్ల పోరాటం ఫలించిందని స్థానికులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ బీజేపీలో ఉత్కంఠ..

-మొదటిపేజీ తరువాయి

ఈరోజు సాయంత్రం వరకు కొత్త అధ్యక్షుడి అభ్యర్థికి అధిష్టానం సంకేతాలు ఇవ్వనున్నట్టు సమాచారం. ఇప్పటికే అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలుస్తోంది. జిల్లా అధ్యక్షులు, స్టేట్ కౌన్సిల్ మెంబర్లతో ఓటరు జాబితా రెడీ అయ్యింది. ఇక ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. నామినేషన్ వేయాలా వద్దా అనేదానిపై తర్వాత నిర్ణయించుకుంటానని రాజాసింగ్ తెలిపారు.

అయితే, అధ్యక్ష పదవి కోసం పార్టీలోని ముఖ్య నేతలంతా ఎవరి స్థాయిలో వాళ్లు ప్రయత్నాలు చేశారు. కానీ సుదీర్ఘ కసరత్తు, అనేక సమీకరణాలు, వడపోతల తర్వాత.. చివరగా రేసులో ఇద్దరే ఇద్దరు నేతలు మిగిలారు. వాళ్లే ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్. అధ్యక్ష పదవిపై బయటికి చెప్పకపోయినప్పటికీ.. పార్టీలో ఇప్పటికే నిర్ణయం జరిగిపోయిందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే సామర్థ్యం ఉన్న నేతకే పార్టీ పగ్గాలు అప్పగిస్తామని ఎంపీ లక్ష్మణ్ ప్రకటించారు.

**ఈటల - అరవింద్..**

బీజేపీ పార్టీకి విధేయుడిగా ధర్మపురి అరవింద్‌కు గుర్తింపు ఉంది. ఇక బీజేపీ అగ్రనేతలు మోదీ, అమిత్‌షాకు సన్నిహితుడిగాను ఆయన ముద్ర వేసుకున్నారు. తెలంగాణలో బలమైన మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన నేత. సూటిగా విమర్శలు చేయడంలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. మిగతా నేతల నుంచి పెద్దగా వ్యతిరేకత లేకపోవడం, బలమైన రాజకీయ నేపథ్యం ఆయనకు కలిసివచ్చే అంశాలుగా భావిస్తున్నారు. ఇక ఈటల రాజేందర్‌ను తీసుకుంటే.. తెలంగాణలో బలమైన బీసీ నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. ఉద్యమ నాయకుడిగా ప్రజాదరణ ఉంది. రాష్ట్ర రాజకీయాలపై పూర్తి పట్టు ఉండడంతో పాటు ప్రత్యర్థి పార్టీల బలాబలాలపై అవగాహన ఉంది. పార్టీలో చేరినప్పుడు అధిష్టానం ఇచ్చిన హామీ కూడా ఆయనకు అనుకూలమైన అంశమే అంటున్నాయి పార్టీ వర్గాలు. కొత్త నాయకుడు ఎవరు అనే చర్చ మొదలైంది.

## కాంగ్రెస్ నేత రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు

**ఆసిఫాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీనివాస్‌ను ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్టు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ప్రకటించింది. రావి శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన టీపీసీసీ క్రమశిక్షణ చర్య కమిటీ(డీఏసీ) ఛైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీలోపు వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీ నియమావళిని అనుసరించి చర్యలుంటాయని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. రావి శ్రీనివాస్ నుంచి సరైన వివరణ రాకపోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

# దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ

**హైదరాబాద్ :** దేశంలో ఫోన్ ట్యాపింగ్ మొదలుపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ సీనియర్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ కాంగ్రెస్ మంత్రులు, నాయకులు సిగ్గు లేకుండా ఫోన్ ట్యాపింగ్ అంశం గురించి అడ్డగోలుగా మాట్లాడడం వింతగా ఉందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీకి వంత పాడే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ఎవరు పిలవకపోయినా.. నా ఫోన్ ట్యాప్ అయ్యిందని కామెడీ చేస్తున్నాడు. ఈ ఫోన్ ట్యాపింగ్ విచారణ చేస్తారు పోలీస్ అధికారులా? గాంధీ భవన్‌లో ఉండే కాంగ్రెస్ మంత్రులు, యూత్ కాంగ్రెస్ నాయకులా? ఏది వాస్తవమో.. ఏది అవాస్తవమో.. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రెస్‌మీట్ పెట్టి ప్రజలకు తెలియజేయండి అని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కుతూ.. హెూం మంత్రిగా బాధ్యతగల పదవిలో ఉంటూ సీఎం రేవంత్ ఇస్తున్న ఆదేశాలతో వారి అనుంగు మీడియాతో తప్పుడు రాతలపై, పిచ్చి కూతలు, దొంగ లీకులతో వ్యక్తిగతంగా దాడులు చేస్తున్నారు. మహా టీవీతో పాటు మరికొన్ని వార్తా సంస్థలు, యూట్యూబ్ ఛానెల్లు అడ్డగోలుగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు.

## మరణానికి కారణమయ్యే మత్తును తరిమేద్దాం




**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 29:** శ్రీకాళహస్తిసమాజంలో అత్యంతప్రమాద కరంగా పరిణమించి,మానవాళిని సమూలంగా నిర్వీర్యంచేస్తూ మనుషుల మరణానికి కారణమవుతున్న మత్తును సమాజం నుండి తరిమేద్దాం రండిఅని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం.ఉమేష్ రావు పిలుపు నిచ్చారు. డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు అనే నినాదంతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం యొక్క పిలుపును అందుకుని తెలుగుదేశం పార్టీ, బిసి విభాగంఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జయరాంరావు వీధిలోని, పూసల వీధి కూడలిలో మాదక ద్రవ్యాల నిరోధకంపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. గత వైసిపి ప్రభుత్వంలోని పెద్దలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉండి, అరాచక వాదులకు టానిక్ వలె ఉపయోగపడిన గంజాయి మహమ్మారిని సమాజంలో లేకుండా సమూలంగా నాశనం చేయడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుండి మాదకద్రవ్యాల ముప్పును నిర్మూలించడానికి, అందరికీ ఆరోగ్యకరమైన, సురక్షితమైన భవిష్యత్తును నిర్మించడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం దృఢమైన చర్యలు చేపట్టి ఈగిల్ అనే స్వతంత్ర వ్యవస్థనుఏర్పాటు చేయడానికి చొరవ చూపడం జరిగింది. ఇది మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో ఒకముఖ్య మైన మైలురాయిని సూచిస్తుందని పేర్కొ న్నారు. ఇందుకు ప్రజల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమైనదని, మాదకద్ర వ్యాలను నిర్మూలించడానికి,మన యువ త శ్రేయస్సు, భవిష్యత్తును కాపాడుకోవడానికి మనంపౌరులుగా,కుటుంబాలుగా, సంస్థలుగా కలిసి సమిష్టిగా పోరాడితేనే మత్తు రహిత సమాజాన్ని చూడగలమని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరధాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం. ఉమేష్ రావు, మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, బీమాల భాస్కర్, సయ్యద్ చాంద్ బాషా, మణి, భగత్, సంజాకుల మురళీకృష్ణ, బిజెపి నాయకుడు సుకుమార్, శివ, సులేమాన్, గగన్ యాదవ్, కృష్ణమూర్తి, అహ్మద్, రియాజ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వయంభు వైష్ణవి మాత ఆలయంలో వారాహి ఉత్సవాలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 29:** చౌడేపల్లి మండలం పుదిపట్ల గ్రామంలో వెలసిన స్వయంభు వైష్ణవి దేవి ఆలయంలో వారాహి నవరాత్రుల్లో, భాగంగా నాలుగవ రోజున సందర్భంగా రక్తపంచమి వైష్ణవిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ రోజున అమ్మవారిని దర్శించుకున్న వారికి సత్సం తానం నవగ్రహ దోష నిర్మూలన సర్వ కార్యసిద్ధి భూ గృహ సమస్య పరిష్కారం జరుగుతుం దని, ఆలయ అర్చకురాలు శ్రావణి తెలియజేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ అందజేశారు. తెల్ల నీళ్లపల్లి గ్రామానికి చెందిన శంకర్ రెడ్డి శంకరమ్మలు ఉభయ దారులుగా వ్యవహరించారు.

# పట్టాలెక్కిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం పట్టాలెక్కింది. ప్రభుత్వ ప్రోత్సాహకర విధానాలు, మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ తదితర అభివృద్ధి ప్రణాళికలతో నగర స్థిరాస్తి రంగం పుంజుకుంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో నగరంలో 10,741 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే కేవలం 3 శాతం తగ్గుదల కనిపించింది. గృహ కొనుగోలుదారులు ప్రీమియం, హైఎండ్ లగ్జరీ గృహాలకే మొగ్గు చూపిస్తుండటంతో అందుబాటు, మధ్యస్థాయి గృహాల లాంచింగ్స్ స్వల్పంగా తగ్గాయని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది.

**హాట్‌స్పాట్ ప్రాంతాలివే..**

లాంచింగ్స్‌లో పశ్చిమ హైదరాబాద్ ఆధిపత్యాన్ని చలాయిస్తోంది. మొత్తం లాంచింగ్స్‌లో ఈ జోన్ వాటా ఏకంగా 51 శాతంగా ఉంది. వెస్ట్ హైదరాబాద్‌లో నానక్‌రాంగూడ ప్రధాన హాట్‌స్పాట్‌గా నిలిచింది. లాంచింగ్స్‌లో ఉత్తర హైదరాబాద్ వాటా 18 శాతంగా ఉండగా.. ఈ జోన్‌లో బాచుపల్లి హాట్‌స్పాట్‌గా ఉంది. ఇక, దక్షిణ హైదరాబాద్ వాటా 17 శాతంగా ఉండగా.. రాజేంద్రనగర్ హాట్‌స్పాట్‌గా ఉంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధికి పశ్చిమ హైదరాబాద్ చోదకశక్తిగా ఉన్నప్పటికీ.. రెండేళ్లుగా క్రమంగా తగ్గుతోంది. ఇదే సమయంలో భూమి లభ్యత, అందుబాటు ధరల కారణంగా ఉత్తర, తూర్పు, దక్షిణ హైదరాబాద్ ప్రాంతాలు క్రమంగా వృద్ధి చెందుతున్నాయి. శివారు ప్రాంతాలలో గృహ నిర్మాణాలు పెరుగుతుండటమే దీనికి ప్రధాన కారణం.

**హైఎండ్ లగ్జరీదే ఆధిపత్యం..**

2025 క్యూ1లో దేశంలోని 8 ప్రధాన నగరాలలో లాంచింగ్స్‌లో అత్యధికంగా 83 శాతం హైఎండ్ లగ్జరీ యూనిట్లు హైదరాబాద్‌లోనే లాంచింగ్ అయ్యాయి. నగరంలో 2024 క్యూ1లోని లాంచింగ్స్‌లో ప్రీమియం ఇళ్ల వాటా 34 శాతంగా ఉండగా.. 2025 క్యూ1 నాటికి ఏకంగా 70 శాతానికి పెరిగింది. నానక్‌రాంగూడ, గండిపేట, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలలో ప్రీమియం ఇళ్లకు అత్యధిక డిమాండ్ ఉంది. లాంచింగ్స్‌లో మధ్యస్థాయి విభాగం గృహాల వాటా 17 శాతంగా ఉంది. అత్యధికంగా బాచుపల్లిలో ఈ తరహా ఇళ్లకు గిరాకీ ఉంది. తూర్పు హైదరాబాద్‌లో ఎక్కువగా ఓపెన్ ప్లాట్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది.



**పెరిగిన ఇళ్ల అద్దెలు..**

నగరంలో గృహాల అద్దెలు గతేడాది క్యూ1తో పోలిస్తే 7 శాతం పెరిగాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి, కోకాపేట ప్రాంతాల్లోని అద్దె ఇళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఐటీ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్, ఇతర ఉన్నతస్థాయి వర్గాలు ఆయా ప్రాంతాలలో నివసించేందుకు ఆసక్తి చూపిస్తుండటమే అద్దెల పెరుగుదలకు ప్రధాన కారణం.

**ఆఫీసు స్పేస్ అదరహో..**

నగరంలో 2025 క్యూ1లో 18.2 లక్షల చ.అ. నికర ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి. గతేడాది క్యూ1తో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ. లక్ష చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణమైన ఆఫీసు లీజులు అత్యధికంగా జరిగాయి. హెల్త్‌కేర్, ఫార్మా, బ్యాంకింగ్ రంగాలలో కంపెనీల విస్తరణల కారణంగా లావాదేవీలలో వృద్ధి నమోదైంది. 2025 క్యూ1లోని ఆఫీసు స్పేస్ లీజులలో అత్యధికంగా 32 శాతం హెల్త్‌కేర్ అండ్ ఫార్మా రంగాలది కాగా.. ఆ తర్వాత ఐటీ%-%బీపీఎం విభాగం 21 శాతం, బ్యాంకింగ్ అండ ఫైనాన్షియల్స్ విభాగం వాటా 11 శాతంగా ఉంది. మాదాపూర్ (81 శాతం), గచ్చి'బౌలి (16 శాతం) ప్రాంతాల్లోని ఆఫీసు స్పేస్‌కు ఎక్కువ డిమాండ్ ఉంది.

**సప్లయి 13.2 లక్షల చ.అ.**

ఇక నగరంలో 2025 క్యూ1లో కొత్తగా మార్కెట్‌లోకి 13.2 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ సప్లయి అయింది. అయితే గతేడాది క్యూ1తో పోలిస్తే మాత్రం ఇది 55 శాతం తగ్గుదల. ఆఫీసు స్పేస్ ప్రాజెక్టుల అనుమతుల జారీలో జాప్యమే ఈ తగ్గుదలకు ప్రధాన కారణం. నగరంలో కార్యాలయ స్థలాల అద్దెలు గతేడాది క్యూ1తో పోలిస్తే 13 శాతం మేర పెరిగాయి. అత్యధికంగా మాదాపూర్‌లో అద్దెలు పెరిగాయి. ఈ ప్రాంతంతో పోలిస్తే గచ్చిబౌలిలో కిరాయిలు 20-25 శాతం తక్కువగా ఉన్నాయి. మెట్రో ఫేజ్-2, హెచ్-సిటీ రోడ్ల విస్తరణ వంటి మౌలిక వసతుల అభివృద్ధి ప్రణాళికలతో కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. దీంతో దీర్ఘకాలంలో ఆఫీసు అద్దెలు మరింత వృద్ధి చెందుతాయి.

# అనంత్ అంబానీ వార్షిక వేతనం రూ.10-20 కోట్లు?

ఇంటర్నెట్ డెస్క్: బిలియనీర్ ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ ఇటీవల రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. మే 1న బాధ్యతలు చేపట్టిన ఆయన.. అయిదేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ క్రమంలోనే ఆయన జీతభత్యాలకు సంబంధించిన వివరాలు బయటకు వచ్చాయి. షేర్‌హోల్డర్ నోటీసు ప్రకారం.. ఆయన రూ.10-20 కోట్ల వార్షిక వేతనం అందుకోనున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా కంపెనీ లాభాలపై కమీషన్ సహా అనేక ప్రోత్సాహకాలు లభించనున్నాయి. వారసత్వ ప్రణాళికలో భాగంగా 2023లో ముకేశ్ అంబానీ తన ముగ్గురు పిల్లలు ఈశా, ఆకాశ్, అనంత్‌లను ఆర్‌ఐఎల్ బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా చేర్చుకున్నారు. నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ముగ్గురికీ ఎటువంటి వేతనం లభించదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సమావేశాలకు



హాజరైనందుకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున సిట్టింగ్ ఫీజుతోపాటు కంపెనీ లాభంపై కమీషన్ రూపంలో రూ.97 లక్షల చొప్పున చెల్లించారు. ఈ క్రమంలోనే 2025 ఏప్రిల్‌లో అనంత్ అంబానీ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

**ఇంతకీ మీ క్రెడిట్ స్కోర్‌ను ఎలా లెక్కిస్తారో తెలుసా?**

"జీతభత్యాలు తదితరాలు కలుపుకొని అనంత్ అంబానీ ఏటా రూ.10- రూ.20 కోట్ల వరకు అందుకోనున్నారు. వసతి, ప్రయాణం, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌తోపాటు సంస్థ కల్పించే భద్రత సదుపాయాలు వంటివి లభిస్తాయి. జీతభత్యాలకు అదనంగా.. నికర లాభాల ఆధారంగా పారితోషికం పొందుతారు" అని రిలయన్స్ సంస్థ తన నోటీసులో తెలిపింది. ఇదిలా ఉండగా.. అనంత్ అంబానీ బ్రౌన్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. సంస్థ ఇంధన వ్యాపారాలను చూసుకుంటున్నారు. ముకేశ్ వారసుల్లో రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియామకమైన తొలి వ్యక్తి ఆయనే.

## సౌతాఫ్రికా క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం..

# చరిత్ర సృష్టించిన కేశవ్ మహారాజ్

సౌతాఫ్రికా క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. ఆ దేశం తరఫున తొలిసారి ఓ స్పిన్నర్ టెస్ట్‌ల్లో 200 వికెట్లు తీశాడు. సౌతాఫ్రికా తరఫున 200 టెస్ట్ వికెట్ల మార్కును ఇప్పటివరకు ఏ స్పిన్నర్ తాకలేదు. ఆ దేశం తరఫున 200కు పైగా టెస్ట్ వికెట్లు తీసిన బౌలర్లంతా ఫాస్ట్ బౌలర్లే. సౌతాఫ్రికా తరఫున టెస్ట్‌ల్లో 200 వికెట్లు తీసిన తొలి స్పిన్ బౌలర్‌గా కేశవ్ మహారాజ్ రికార్డు నెలకొల్పాడు. జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో కేశవ్ ఈ ఘనత సాధించాడు. జింబాబ్వే కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ వికెట్ కేశవ్‌కు 200వ టెస్ట్ వికెట్. కేశవ్ తర్వాత టెస్ట్‌ల్లో సౌతాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్లుగా టేఫీల్డ్ (170), పాల్ ఆడమ్స్ (134), పాల్ హ్యారిస్ (103), నికీ బోయే (100) ఉన్నారు. ఓవరాల్‌గా టెస్ట్‌ల్లో సౌతాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా డేల్ స్టెయిన్ (439) ఉన్నాడు. అతని తర్వాత షాన్ పోలాక్ (421), ఎన్తిని (390), రబాడ (336), డొనాల్డ్ (330), మోర్కెల్ (309), కల్లిస్ (291), ఫిలాండర్ (224) 200 కంటే ఎక్కువ వికెట్లు తీసిన వారిలో ఉన్నారు. వీరంతా ఫాస్ట్ బౌలర్లే. మ్యాచ్ విషయానికొస్తే.. రెండు మ్యాచ్‌ల



సిరీస్‌లో భాగంగా బులవాయో వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో రెండో రోజు ఆట కొనసాగుతుంది. రెండో సెషన్ సమయానికి జింబాబ్వే 3 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తుంది. బ్రియాన్ బెన్నెట్ (19) రిటైర్డ్ హర్ట్ కాగా.. కైటానో 0, వెల్చ్ 4, క్రెయిగ్ ఎర్విన్ 36 పరుగులకు ఔటయ్యారు. సీన్ విలియమ్స్ (81), వెస్లీ మెదెవెరె (15) క్రీజ్‌లో ఉన్నారు. సౌతాఫ్రికా బౌలర్లలో కోడి యూసఫ్ 2, కేశవ్ మహారాజ్ ఓ వికెట్ తీశారు. అంతకుముందు సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 418 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. లుహాన్ డ్రి ప్రిటోరియస్ (153), కార్బిన్ బాష్ (100 నాటౌట్) సెంచరీలతో కదంతొక్కారు. డెవాల్డ్ బ్రెవిస్ (51) మెరుపు అర్ధ సెంచరీతో రాణించారు. మిగతా ఆటగాళ్లలో టోని డి జోర్జి 0, బ్రీట్జ్కీ 13, ముల్డర్ 17, బెడింగ్హమ్ 0, వెర్రిన్ 10, కెప్టెన్ కేశవ్ మహారాజ్ 21, కోడి యూసఫ్ 27, మఫాకా 9 (నాటౌట్) పరుగులు చేశారు. జింబాబ్వే బౌలర్లలో చివంగ 4, ముజరబానీ 2, మసరద్జ, మసెకెస తలో వికెట్ తీశారు.

# బుమ్రాపైనే ఎక్కువగా ఆధారపడొద్దు.. కుల్దీప్‌ను ఆడించాలి

ఇంగ్లండ్ పర్యటనను ఓటమితో ఆరంభించిన భారత జట్టు సిరీస్ సమం చేయాలనే పట్టుదలతో ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే రెండో టెస్టులో విజయమే లక్ష్యంగా నెట్స్‌లో గంటలకొద్దీ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు టీమిండియా క్రికెటర్లు. అయితే.. సిరీస్‌లో కీలకమైన ఈ మ్యాచ్‌కు వర్క్‌లోడ్ కారణంగా పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉండడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యలో మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ జట్టు కూర్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు ఎక్కువగా బుమ్రాపై ఆధారపడుతోందని.. అలాకాకుండా బౌలర్లు సమిష్టిగా రాణించాలని అజారుద్దీన్ అభిప్రాయపడ్డాడు. 'భారత జట్టు బౌలింగ్ యూనిట్‌లో బుమ్రాపై అతిగా ఆధారపడుతోంది. ప్రతిసారి అతడు మెరుగైన ప్రదర్శన చేయలేడు కదా. పైగా ఇంగ్లండ్ పిచ్‌ల మీద అనుభవజ్ఞులైన బౌలర్లు ఉంటేనే వికెట్లు తీయగలం. అందుకే.. రెండో టెస్టులో కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలి. చైనామన్ బౌలర్ అయిన కుల్దీప్ వైవిధ్యమైన బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించగలడు. ఈమధ్య అతడు గొప్పగా రాణిస్తున్నాడు' అని అజారుద్దీన్ తెలిపాడు. లీడ్స్ టెస్టులో అనూహ్య ఓటమిపై కూడా ఈ దిగ్గజ క్రికెటర్ స్పందించాడు. 'బ్యాటింగ్ యూనిట్ ముఖ్యంగా లోయరార్డర్ వైఫల్యంతో ఓటమి ఎదురైంది. రెండో టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తు చేయాలంటే పక్కాగా సిద్ధమవ్వాలి. వికెట్లు తీయగల బౌలర్లను తీసుకోవాలి. అప్పుడే సిరీస్ సమయం చేయగలుగుతాం. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ విషయానికొస్తే అతడికి ఇదే మొదటి సిరీస్. తొలి మ్యాచ్‌తోనే అతడి సామర్థ్యంపై అంచనాకు రాలేం. గిల్ ఈమధ్యే పగ్గాలు చేపట్టాడు కాబట్టి అతడికి కొంత సమయం ఇవ్వాలి. అతడిపై ఇప్పుడిప్పుడే విమర్శలు



ఎక్కుపెట్టడం సరికాద'ని అజారుద్దీన్ అన్నాడు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య రెండో టెస్టు జూన్ 30న ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగనుంది.

## స్పోర్ట్స్

## ఐసీసీ కోడ్ ఉల్లంఘన.. వెస్టిండీస్ హెడ్‌కోచ్ మ్యాచ్ ఫీజులో కోత




వెస్టిండీస్ హెడ్‌కోచ్ డారెన్ సమీపై అంతర్జాతీయ క్రికెట్ మండలి క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఐసీసీ నియమావళిని అతిక్రమిస్తూ టీవీ అంపైర్ నిర్ణయాన్ని బహిరంగా తప్పుపట్టినందుకు అతడికి మ్యాచ్ ఫీజులో కోత విధించింది. అంతేకాదు ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించింది. మ్యాచ్ అనంతరం సమీపై రిఫరీ ఐసీసీకి ఫిర్యాదు చేశాడు. దాంతో, విచారణ సమయంలో విండీస్ కోచ్ తన పొరపాటును అంగీకరించాడు. మ్యాచ్ అధికారిని బాహాటంగా విమర్శించినందుకు.. అతడి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించింది ఐసీసీ. 'మీ పని మీరు సక్రమంగా చేయండి అన్నందుకు నన్ను దోషిగా గుర్తించారు. టీవీ అంపైర్ అడ్రియన్ హోల్డ్‌స్టాక్‌తో నాకు తరచూ వాగ్వాదం జరుగుతోంది. ఇంగ్లండ్ సిరీస్ నుంచి అతడితో నేను విభేదిస్తున్నా. ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో కూడా కచ్చితత్వంతో కూడిన నిర్ణయాలు వెలువరించాలని అంపైర్‌ను కోరానంతే. కానీ అదే తప్పని అంటున్నారు' అని సమీ మీడియా సమావేశంలో వెల్లడించాడు. బార్బడోస్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన తొలిటెస్టులో ఐదుగురు విండీస్ బ్యాటర్లు వివాదాస్పదంగా ఔటయ్యారు. దాంతో, హెడ్‌కోచ్ సమీ టీవీ అంపైర్‌పై కోపం పట్టలేకపోయాడు. కెప్టెన్ రోస్టన్ ఛేజ్ సైతం తమపై పగబట్టినట్టుగా తప్పుడు నిర్ణయాలు ప్రకటిస్తున్నారని విమర్శలు గుప్పించాడు. అలెక్స్ క్యారీ అందుకున్న బంతి నేలకు తాకినా సరే ఔటిచ్చాడు థర్డ్ అంపైర్ హోల్డ్‌స్టాక్. అంతేకాదు బంతి బ్యాట్‌కు తాకినట్టు స్పష్టంగా అల్ట్రా ఎడ్జ్‌తో తేలినప్పటికీ ఎల్బీగా ఔట్ ఇవ్వడంతో విండీస్ ఆటగాళ్లు ఇదెక్కడి అన్యాయం అని షాకయ్యారు. తొలి టెస్టులో ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకే ఆలౌటయ్యింది. అనంతరం ఆతిథ్య జట్టును 190కే కట్టడి చేసిన ఆసీస్.. బ్యూ వెబ్‌స్టర్(63), అలెక్స్ క్యారీ(63)లు రాణించడంతో 310 రన్స్ కొట్టింది. అనంతరం ఛేదనలో వెస్టిండీస్‌ను జోష్ హేజిల్‌వుడ్ దెబ్బకొట్టాడు. ఐదు కీలక వికెట్లు తీసి ఆసీస్‌కు 159 పరుగుల విజయాన్ని అందించాడు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143